సింహంలా పోరాడతా

మొదటిపేజీ తరువాయి...

బలమైన వ్యక్తిని అని అనుకుంటున్నా.. నా కుటుంబాన్ని రక్షించే విషయంలో నేను సింహాన్ని' అని స్పష్టంచేశారు. 'అదృష్టవశాత్తు తెలుగు చలనచిత్ర పరిశ్రమ అంతా మాకు అండగా నిలిచింది, ఇందుకు చిత్రపరిశ్రమకు ధన్యవాదాలు.. ఇది మా నాన్నగారి ఆశీర్వాదాలుగా భావిస్తున్నా' అని పేర్కొన్నారు. తన కుమారుడు నాగచైతన్య, ఆయన మాజీ భార్య సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో నాగార్జున క్రిమినల్ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో శుక్రవారం నాగార్జున ప్రముఖ ఇంగ్లిష్ మీడియా సంస్థ టైమ్స్ నౌకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా కొండా సురేఖ తీరుపై ఆయన ఫైర్ అయ్యారు.

ప్రశ్న : మంత్రి సురేఖపై కేసుపెట్టారు కదా.. ఆమె నుంచి మీరేం ఆశిస్తున్నారు?

నాగార్జున : మంత్రి సురేఖపై గురువారం క్రిమినల్ కేసు పెట్టడంతో పాటు పరువునష్టం దావా వేశాం. ఆమెపై మరో వంద కోట్ల పరువునష్టం దావా వేయబోతున్నాం. కొండా సురేఖ హద్దుదాటి మాట్లాడారు. ఆమె మాటలు అస్సలు ఆమోదయోగ్యంకాదు. ఇప్పుడు కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్టు చెప్పారు. సమంతకు క్షమాపణలు చెప్పారు. కానీ నా పరిస్థితి.. నా కుటుంబం పరిస్థితేంటి? నా కుటుంబానికి క్షమాపణలు చెబుతున్నట్టు ఆమె ఒక్క మాటైనా అనలేదే?

ప్రశ్న : ఒకవేళ మంత్రి మీకు, మీ కుటుంబానికి క్షమాపణలు చెబితే పరువు నష్టం దావాను ఉపసంహరించుకుంటారా?

నాగార్జున : కుదరదు. నా కుటుంబానికి క్షమాపణ చెప్పినా కేసును ఉపసంహరించుకునే ప్రసక్తేలేదు. ఆ అవకాశమే లేదు. ఇది వ్యక్తిగత విషయం కాదు. నన్ను, నా కుటుంబాన్ని దాటిపోయింది. తెలుగు చిత్ర పరిశ్రమలోని చిన్నా పెద్దా అంతా మాకు మద్దతుగా నిలిచారు. మన వ్యవస్థకు సోకిన తెగులును అరికట్టే ప్రక్రియలో మేమున్నామని నేను భావిస్తున్నా. మీ రాజకీయ ప్రయోజనాల కోసం మా పేర్లను వాడుకోవడం సరికాదు. మేం చిత్ర పరిశ్రమకు చెందినంత మాత్రాన మాపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా మెతకగా ఉండబోము. ఈ విషయంలో మంత్రి సురేఖపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇతర రాజకీయ నాయకులు మమ్మల్ని దూషించేందుకు ఒక గట్టి హెచ్చరిక అవుతుందని నేను ఆశిస్తున్నా.

ప్రశ్న : మన దేశంలో చట్టపరమైన అంశాలు తెలుసుగా? ప్రత్యేకించి పరువు నష్టం దావా కేసులు ఏండ్ల తరబడి సాగుతాయి?

నాగార్జున : అవును. నాకు తెలుసు. పూర్తి అవగాహన ఉన్నది. ఈ కేసులో పోరాటానికి నేను సిద్ధంగా ఉన్నా. అందుకే మేము క్రిమినల్ డిఫమేషన్ కేసు పెట్టాం. మేము వేగంగా తీర్పు ఆశిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోం. చట్టపరంగా చివరి వరకు పోరాడుతాం.

ప్రశ్న : ఈ సంవత్సరం మీకు సానుకూలంగా లేనట్టున్నది.

నాగార్జున : అవును. సమస్యలు ఒకదాని తర్వాత మరొకటి ఎదురవుతూనే ఉన్నాయి. ఇదే చివరి సమస్య అని ప్రతిసారీ భావిస్తున్నా. కానీ, దేవుడు మరో విధంగా కష్టాల మీద కష్టాలు తెస్తున్నాడు. అయినా, నో ప్రాబ్లం. నేను ఎప్పుడూ బలమైన వ్యక్తిగా నిలబడ్డాను. నా కుటుంబాన్ని రక్షించడంలో నేను సింహంలా ఉంటా. అదృష్టవశాత్తు తెలుగు పరిశ్రమ మొత్తం మాతో నిలబడటానికి ముందుకొచ్చింది. ఇది నా నాన్నగారి మంచితనం, ప్రేమ, ఆశీస్సులు కావచ్చు.

ప్రశ్న : మీ మంచితనం, పరువు ప్రతిష్ఠ పరిస్థితి ఏమిటి?

నాగార్జున : ఆమె వ్యాఖ్యలతో మా పరువు, ప్రతిష్ఠ దెబ్బతిన్నది. ఈ ఇంటర్వ్యూ ద్వారా మీడియా మాకు మద్దతుగా, అండగా నిలబడినందుకు ధన్యవాదాలు.

రేవంత్‌తో కేవీపీ ఢీ అంటే ఢీ

నర్మగర్భ వ్యాఖ్యలతో సీఎంకు బహిరంగ లేఖ

- సీనియర్‌ను గౌరవించడం లేదంటూ వ్యాఖ్యలు
- మూసీ ప్రాజెక్టు రేవంత్ బ్రెయిన్‌చైల్డ్ కాదు.. వైఎస్ హయాంలోనే ప్రారంభమైందని స్పష్టీకరణ
- అప్పుల పాలు చేయొద్దనే నాడు పక్కన పెట్టారని వెల్లడి
- అందుకు భిన్నంగా రేవంత్‌రెడ్డి వెళ్తున్నారని చురకలు
- కూల్చివేతల్లో పారదర్శకత లోపించిందంటూ ఎత్తిపొడుపులు

హైదరాబాద్, అక్టోబర్4 (నమస్తేతెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సై అంటే సై అన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు! శుక్రవారం ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు, సుతిమెత్తని హెచ్చరికలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖాస్త్రం సంధించారు. కాంగ్రెస్ రాజకీయాల్లో తాను సీనియర్‌ను అని చాటుతూ, రేవంత్ తనకంటే జూనియర్ అని ఎత్తిపొడిచారు. కాంగ్రెస్ పట్ల తన నిబద్ధతను శంకిస్తున్నారంటూ అసహనం వ్యక్తంచేశారు. ఆ మాటకొస్తే.. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు రేవంత్‌రెడ్డి బ్రెయిన్‌చైల్డ్ కాదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ఆ ఆలోచన రూపుదిద్దుకున్నదని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధామ్యాలను గుర్తెరగకుండా అప్పులు చేస్తున్నదని దెప్పిపొడిచారు. కంటోన్మెంట్‌లో గురువారం నిర్వహించిన డిజిటల్ ఫ్యామిలీ కార్డుల పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ కూల్చివేతలు, హైడ్రాపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌సాగర్‌లో అక్రమంగా ఫాంహౌజ్‌లను నిర్మించుకున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు పేరును కూడా రేవంత్‌రెడ్డి ఉటంకించారు. ఈ నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని, పాలనాపరమైన విధానాలను పరోక్షంగా ఎత్తిచూపిన ఆ లేఖ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

నా నిబద్ధత గురించి చెప్పకోవడం బాధాకరం

'ప్రస్తుత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కర్ణాటక గుల్బర్గా ప్రాంతంలో పార్టీ ప్రముఖ నాయకుడిగా ఉన్న సమయంలో దాదాపు 1970లోనే కాంగ్రెస్ పార్టీతో నా ప్రస్థానం ప్రారంభించాను' అని కేవీపీ తన లేఖలో పేర్కొన్నారు. తద్వారా పార్టీలో రేవంత్‌రెడ్డి తనకంటే చిన్నవాడని, చాలా తక్కువని అని చూపించే ప్రయత్నం చేశారు.

'కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. ప్రభుత్వం తీసుకునే ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని త్రికరణశుద్ధిగా సమర్థిస్తాను. చిత్తశుద్ధితో అమలుచేయడానికి శాయశక్తులా కృషి చేస్తాను అని ఈరోజు ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రికి చెప్పవలసి రావడం బాధాకరమే అయినా తప్పడం లేదు' అని పేర్కొనడం ద్వారా తన నిబద్ధతను రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదనే విషయాన్ని కేవీపీ ఎత్తిచూపారని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కాంగ్రెస్‌కు అత్యంత ఇష్టమైన ప్రాజెక్ట్ అని, 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి నిలిపారని పేర్కొనడం ద్వారా అది రేవంత్‌రెడ్డి బ్రెయిన్‌చైల్డ్ ప్రాజెక్టు కాదని, తన మిత్రుడు వైఎస్సే దానికి బీజం వేశారని పరోక్షంగా చెప్పుకొచ్చారు.

2005లోనే సేవ్ మూసీ పథకాన్ని రూ.908 కోట్ల అంచనాతో వైఎస్ ప్రారంభించారని, అయితే నాడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయొద్దనే ఉద్దేశంతో మూసీ ప్రక్షాళన చేపట్టలేదని లేఖలో పేర్కొనడం ద్వారా.. నేడు రేవంత్ సర్కార్ సంక్షేమాన్ని విస్మరించి, మూసీని తలకెత్తుకొని, రాష్ట్రంపై అప్పుల భారం మోపుతున్నదనే రీతిలో మాట్లాడారు.

మూసీ ప్రక్షాళన వల్ల నష్టపోయే ప్రతి పేద, మధ్య తరగతివారికి సంతృప్తికరమైన పునరావాసం కల్పించి, మూసీకి పూర్వస్థితి కల్పించాలంటే, అధిక మొత్తంలో నిధులు అవసరమని గ్రహించి, ఆ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోయిందని కేవీపీ పేర్కొన్నారు. తద్వారా రేవంత్‌రెడ్డికి వాటిపై ఏమాత్రం అవగాహన, సరైన ప్రణాళిక లేదనే అర్థం వచ్చే రీతిలో పదాలను దట్టించడం గమనార్హం.

రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్..!

లేఖలో ప్రస్తావించిన, లేవనెత్తిన అంశాలను పరిశీలిస్తే, సీఎం రేవంత్‌రెడ్డికి కేవీపీ నేరుగానే సవాల్ విసిరినట్టు అర్థమవుతున్నది.

తన ఫాంహౌజ్‌పై ఆరోపణలు వచ్చినరోజే సొంత ఖర్చులతో కూల్చడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేశానని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా వెంటనే అధికారులను తన ఫాంహౌజ్‌కు పంపించాలని కోరారు. మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని, మార్కింగ్ చేసే సమయం, తేదీ తనకు ముందే తెలియజేయాలని సూచించారు. తద్వారా ప్రస్తుత ప్రక్రియ పారదర్శకంగా లేదని చెప్పకనే చెప్పారు.

'పల్లంరాజు' వ్యవహారంలా కాకుండా తనకు ముందే తేదీ చెప్పాలని పరోక్షంగా హెచ్చరించారు. 'మీరు, నేను కలుగజేసుకోకుండా, చట్టాన్ని తన పని తాను చేసుకొని పోనిద్దాం' అని కేవీపీ పేర్కొనడం ద్వారా రేవంత్ తనను టార్గెట్ చేస్తున్నారనే సందేశం పంపారు. ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకోకుండా ఉంటే చట్టం తన పని తాను చేసుకొని పోతుందని సలహా ఇచ్చారు.

ఈ లేఖలో 'నేను కాంగ్రెస్ కార్యకర్తను.. నా నరనరాన కాంగ్రెస్ రక్తం ఉన్నది.. అనేక ఏండ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉన్నాను.. కాంగ్రెస్‌కు నష్టం జరిగే పని చేయను.. అంతరాత్మ.. నా తుది ఊపిరి వరకూ..' అని పదే పదే వ్యక్తీకరించడం ద్వారా తాను రేవంత్ కన్నా ఎక్కువ విధేయుడైన కాంగ్రెస్ వాదినని కేవీపీ ఘంటాబజాయించారు.

మూసీపై కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు

మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, వాటిని సీఎం రేవంత్‌రెడ్డి పరిగణనలోనికి తీసుకోవడం లేదన్న విషయాన్ని కేవీపీ ఈ లేఖ ద్వారా బహిర్గతం చేశారు. 'పార్టీ శ్రేయోభిలాషులు మూసీ ప్రక్షాళనను మొదటి దశలోనూ, సుందరీకరణను రెండో దశలోనూ చేపడితే బాగుంటుందని మీకు సూచించవవలసినదిగా నన్ను కోరినా.. మూసీ సుందరీకరణపై మీ ఆసక్తిని గమనించి, మీ ఆలోచన, విజన్, సమర్థతపై నమ్మకంతో.. ఆ విషయం మీ దృష్టికి తేలేదు. పేదలకు నష్టం కలుగకుండా ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి పనులకు ఒక క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా స్వాగతిస్తాను' అని పేర్కొన్నారు. రేవంత్ వ్యవహార శైలి వల్ల పేదలకు నష్టం కలుగుతున్నదని పరోక్షంగా ఎత్తిచూపారు. 'అజీజ్‌నగర్‌లోని నా కుటుంబసభ్యుల పేరు మీదున్న ఫాంహౌజ్‌పై ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు. అది క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ నేతగా తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నది' అని కేవీపీ పేర్కొన్నారు. నిజానికి కేవీపీ పేరును ప్రతిపక్షాలు ఎప్పుడు మరిచిపోయాయి. ఈ అంశాన్ని లేవనెత్తింది రేవంత్‌రెడ్డే! ప్రతిపక్షాలు అంటూ రేవంత్ తీరును, ఆయన క్రమశిక్షణను కేవీపీ ప్రశ్నించారు.

కొండా సురేఖపై చర్యలు తప్పవు!

కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్ మేకా

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): సినీనటులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్ మేకా స్పష్టంచేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు కేవలం క్షమాపణ సరిపోదని పేర్కొన్నారు. శుక్రవారం ఓ మీడియా చానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆమెపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాల్సిందేనని చెప్పారు. సురేఖ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి అప్పగించాలని, వారు ఆమెపై చర్యలు చేపట్టాలని కోరారు.



రేవంత్ తీరుపై పెద్దలు సీరియస్

మొదటిపేజీ తరువాయి...

కానున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ తరువాత నేరుగా వచ్చి తమను కలిసి వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మరోవైపు కాంగ్రెస్ విధేయుడు, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సైతం అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్టు తెలుస్తున్నది.

సురేఖపై ఏం చర్యలు తీసుకున్నారు?

అక్కినేని ఫ్యామిలీపై మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ యావత్ సినీతారాలు కాంగ్రెస్‌పై ఒక్కసారిగా భగ్గుమన్నారు. దీంతో కాంగ్రెస్ హైకమాండ్ ఉలిక్కిపడినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డికి నేరుగా ఫోన్ చేసి సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. కొండా సురేఖ వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదు? అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ నెల 6న ఢిల్లీకి వచ్చిన సమయంలో సురేఖ అంశంపై స్పష్టమైన అభిప్రాయం చెప్పాలని తెగేసి చెప్పినట్టు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

కేకేతో రేవంత్ రహస్యమంతనాలు

అధిష్ఠానం వార్నింగ్ ఇచ్చిన నేపథ్యంలోనే ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కాంగ్రెస్ సీనియర్ నేత కే కేశవరావును పిలిపించుకుని దాదాపు గంటకుపైగా రహస్యంగా భేటీ అయినట్టు తెలిసింది. స్పోర్ట్స్ పాలసీ రివ్యూ మీటింగ్‌కు సైతం ఆయనను సీఎం వెంటబెట్టుకుని వెళ్లారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిణామాలపై అధిష్ఠానం ఏం చర్చించుకుంటున్నది? అనే అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తున్నది. కొండా సురేఖ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటే అధిష్ఠానం శాంతిస్తుంది అని కూడా కేకే నుంచి సలహా తీసుకున్నట్టు తెలిసింది. ఈ విషయంలో తనకు మద్దతు ఇవ్వాలని కోరినట్టు కాంగ్రెస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.

విషయం పెద్దది కాకుండా చూడండి

అక్కినేని కుటుంబంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో రంగంలోకి దిగిన అధిష్ఠానం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఫోన్ చేసి వివాదం పెద్దది కాకుండా చూడాలని, మంత్రితో క్షమాపణ చెప్పించాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రి సురేఖతో అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నదని మీడియా ముఖంగా క్షమాపణ కోరాలని చెప్పగా, తాను ఇప్పుడు వెనక్కి తగ్గితే ప్రజల్లో పలుచన అవుతానని, ఈ విషయంలో ఎలాంటి సమస్యను ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉన్నానని సురేఖ చెప్పినట్టు తెలిసింది. కానీ, అనూహ్యంగా గురువారం ఉదయం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సమంత విషయంలో తాను మాట్లాడింది తప్పేనని ఒప్పుకొన్నారు. ఒక మహిళగా తనకు అవమానం జరిగిందని చెప్పే క్రమంలో భావోద్వేగంతో చేసిన వ్యాఖ్యలు ఆమెను బాధపెట్టాయని గుర్తించానని, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొంటున్నానని ప్రకటించారు. కేవలం సమంత విషయంలో తప్పు మాట్లాడినట్టు చెప్పడంతో నాగార్జునకు పుండు మీది కారం చల్లినట్టయింది. శుక్రవారం టైమ్స్‌నౌ ఇంటర్వ్యూలో కూడా ఆయన ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు సురేఖ క్షమాపణ చెప్తే మీరు అంగీకరిస్తారా? అని జర్నలిస్టు ప్రశ్నించగా.. ఆ సమయం దాటిపోయిందని తేల్చిచెప్పారు. ఏదైనా కోర్టులో తేల్చుకుంటానని స్పష్టం చేశారు. ఈ వివాదం చిలికిచిలికి గాలివానగా మారుతుండటంపై అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే నాగార్జునతో రాజీకి కాంగ్రెస్ నేతలు మంతనాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఒకవేళ రాజీ కుదిరితే కేసు వాపసు తీసుకోవాలా వద్దా అన్న మీమాంశ కొనసాగుతుంది. సెక్షన్ 356 బీఎన్ఎస్ ప్రకారం మూడేండ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్న కేసులో రాజీ చేసుకునే వీలుంటుందని నిపుణులు అంటున్నారు.

అమలకు ప్రియాంకగాంధీ భరోసా

కొండా సురేఖ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన అక్కినేని అమల నేరుగా ఈ విషయాన్ని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను అంగీకరిస్తున్నారా? అంటూ ట్విట్టర్ వేదికగా నిలదీశారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ ప్రియాంకగాంధీ నేరుగా అక్కినేని అమలకు ఫోన్ చేసినట్టు తెలుస్తున్నది. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నామని, దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కొండా సురేఖపై వేటు తప్పదనే ప్రచారం జోరుగా కొనసాగుతున్నది.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పిలుపు..

మరోవైపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సైతం అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినట్టు తెలిసింది. కొండా సురేఖ అంశంపై ఆయనను ఆరా తీసినట్టు విశ్వసనీయ సమాచారం. ఉత్తమ్ తండ్రి ఇటీవలనే మృతి చెందిన నేపథ్యంలో ఆయన కర్మకాండల క్రియలు ముగిసిన అనంతరం నేరుగా ఢిల్లీకి రావాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇంత హడావుడిగా మంత్రి ఉత్తమ్‌ను ఢిల్లీకి పిలిపించడంపై సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

నేడు కోర్టులో నాగార్జున వాంగ్మూలం!

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా వేసిన సినీ నటుడు అక్కినేని నాగార్జున వాంగ్మూలం నమోదుకు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నాగార్జున వాంగ్మూలాన్ని శనివారం నమోదు చేసే అవకాశాలున్నట్టు సమాచారం. కోర్టు ప్రొసీడింగ్ ఆఫీసర్ (మెజిస్ట్రేట్) శుక్రవారం సెలవుపై ఉండటంతో శనివారం వాంగ్మూలం నమోదుకు కోర్టు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ఆ తర్వాత సాక్షులుగా ఉన్న యార్లగడ్డ సుప్రియ, వేంకటేశ్వర్లు కూడా తమ వాంగ్మూలాల్ని నమోదు చేయనున్నట్టు సమాచారం. ఈ కేసులో సాక్ష్యాధారాలుగా పెన్‌డ్రైవ్, సీడీలు, పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్‌లు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు చెందిన వీడియోలు కోర్టుకు సమర్పించారు. వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం కేసు నమోదుకు కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఆ తర్వాత మంత్రి కొండా సురేఖకు లంగర్‌హౌజ్ పోలీసులు సమన్లు జారీ చేసిన పిదప కోర్టు విచారణ చేపట్టనుంది.

రగులుతున్న అక్కినేని కుటుంబం

కొండా సురేఖ వ్యాఖ్యలపై తీవ్ర మనోవేదన

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): తమ కుటుంబాన్ని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన అవమానకర వ్యాఖ్యల పట్ల అక్కినేని కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతున్నది. మంత్రి తన రాజకీయాల కోసం తమను తీవ్రంగా అవమానించడాన్ని అక్కినేని కుటుంబసభ్యులు తట్టుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా వారు ఆరు ట్వీట్లు చేయగా, ప్రతి ట్వీట్‌లో వారి ఆవేదన, ఆగ్రహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అక్కినేని అమల, అఖిల్ ఘాటు వ్యాఖ్యలతో ట్వీట్లు చేశారు. జుగుప్సాకరంగా చేసిన వ్యాఖ్యల పట్ల సురేఖను క్షమించే సమస్యే లేదని అక్కినేని కుటుంబం స్పష్టం చేసింది. సురేఖ అవమానకర వ్యాఖ్యలపై తొలి రోజే 'ఎక్స్' వేదికగా అమల ఘాటుగా స్పందించారు. 'మీరు మానవ మర్యాదలను విశ్వసిస్తే దయచేసి మీ నాయకులను అదుపులో ఉంచండి. మీ మంత్రితో నా కుటుంబానికి క్షమాపణ చెప్పించి, విషపూరిత ప్రకటనలను ఉపసంహరించుకోమని చెప్పండి' అంటూ రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. కొండా సురేఖ వ్యాఖ్యల పట్ల అక్కినేని అఖిల్ తీవ్ర ఘాటు వ్యాఖ్యలతో ట్వీట్లు చేశారు. నైతికతను మరిచి కొండా సురేఖ వ్యవహరించిన తీరు సిగ్గుచేటని, క్షమించరానిదని మండిపడ్డారు. కొండా సురేఖ లాంటి వ్యక్తిని క్షమించడానికి సమాజంలో చోటు లేదని అన్నారు. ఆమె వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.

న్యాయం కోసం ఎంత వరకైనా..

సురేఖ మొదట చేసిన వ్యాఖ్యల్లో, ఆ తర్వాత ఇచ్చిన వివరణలోనూ తమ కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారని అక్కినేని కుటుంబం ఆవేదన చెందుతున్నది. జాతీయ స్థాయిలో తమను అవమానించిన కొండా సురేఖను క్షమించరాదని భావిస్తున్నది. న్యాయపరంగా తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించింది. ఇప్పటికే అక్కినేని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువునష్టం దావా వేశారు. సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. సురేఖపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాల్సిందిగా ప్రధాని, రాష్ట్రపతిని సైతం కలిసి విజ్ఞప్తి చేయాలని నాగార్జున భావిస్తున్నట్టు తెలుస్తున్నది.